

# ఓ పట్టు పట్టు... కొడవంటి కాశీపతిరావు

రంగారావు బాబుకి అమ్మోరు కల్లో కొచ్చిందటని వీధి వీధంతా పాకి పోయింది.

"అమ్మోరు ఏంటంటది?"

"రంగారావుబాబు ఇంటిగుమ్మం లేదా... గుమ్మానికి సరింగా ఎదురుగ్గా రోడ్డు మీద ఆయమ్మ కలసవో పెట్టించి సిన్నచూరు లెగ దియ్యమందిట్రా అమ్మోరు"

'అదుస్టమంతు డా బావు. ఎంత పున్నెం సేసుకుండో కాపోతే ఆ బావు కల్లోక మ్మో రావడవే అదుస్టం. ఆపైని ఆబావు గుమ్మం' ఎదార కూకుడుంటానంటే ఇంకేటి సెప్పాల'

ఆ వీధి ఈవాసా, ఆవాసా పెద్దా చిన్నా అంతా రంగారావుగారి మేడ దగ్గర హాజరయ్యేరు. ఆయన నోటి ద్వారానే అంతా విందామని.

కల్లో కొచ్చిందటంటే అమ్మోరు తెల్లారి పదో గంటకల్లా చర చరా

'రాత్రి కసింత పొద్దోయి తొంగున్నాన్రా ఏంటి? నీను తొంగునే ఏళ్టకి రొంచో మూడో అవుద్ది. కొత్త కమిసనరు ఒచ్చేరు కదా...సిన్న పార్టీ సేసేరూళ్ళోని పెద్దలంతా. అయిందా? పీనొచ్చీసరికి మా యావిడ నిద్దర బోతున్నాది. సరి. దగ్గరసా ఎల్లి నెరి కొరే గబగబ గజా గబ ఒకటే ఒణుకు. నీను కాదురా మా యావిడ. ఒణికిపోవడం సెవట్లు పట్టీడం...గబగబలాడి పోడం నీరు కారిపోడం మరేంటి సెయ్యనురా బగమంతు డాని మాసెడ్డ ఆలోసించిన మీదట మన డాట్రు జెగన్నాదం లేడా మన పెద్దీది డాట్రు

ఫోను సేద్దారని ఫోను తీస్తే ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ మని ఎంత మోగించినా ఎవలూ తియ్యరే? ఇంకేటి సేద్దును? మిమ్మల్ని లేపీదా... మిమ్మల్ని లేపీదా... నా ఇంట్లో గాభరాకి మిమ్మల్నెలా గిబ్బంది పెట్టేదును? మరింక నాబం లేదని తిన్నగా దేవుడి గదిలో కెళ్ళేను. ఈస్వెరుడికి దణ్ణవెట్టేను. ఎంక ట్రవణమూర్తికి దణ్ణెపెట్టేను. మనూరి తల్లి అమ్మోరికి దణ్ణవెట్టేను. మరింక వొచ్చి చూద్దును. మాయావిడ నిస్చింత నిర్భూచీగా నిద్దర బోతున్నాది. మరింక పూచీ పేచీ లేదురా అని నీనూ తొంగుడున్నాను. మరింకేంటి ధన్నమని కళ్ళల్లోకి దిగీసిందిరా అమ్మోరు. మరి నీ దణ్ణానికి దారి సూపించేను గదా నియ్యింటి కెదరగా కూకుడుంటాను, నా దారికి దణ్ణా వెట్టించు పెజల్చేత అందిరా. అండవండే ఇలాగలాక్కాదు చెవ్వులు బద్దలయి పోయేయనుకో. మరింక నాకు మాట పెగులుద్దా? చచ్చి గింజుకున్నా మాటరాదే. సరే ఓరం రోజులు గడువిస్తున్నానని నా పీకల మీద సవాల్జేసి మరీ లెగిసెళ్ళి పోయిందమ్మోరు. అమ్మోరెళ్ళి పోడవేంటి లెగిసి సూద్దుని తెల్లారైదు గంటలు కొడతున్నాది' అంటూ ముగించేడు రంగారావు.

అంతవరకూ నోరెళ్ళబెట్టి విన్నా కూడా సగం మంది మాత్రం నమ్మేరు. లేదా నమ్మినసట్టు కన్పించేరు. కొంతమంది మాత్రం "ఓస్ పెద్ద బత్తుడుదిగొచ్చేడురా" అంటూ దులపరించుకు వెళ్ళిపోయేరు.

రంగారావు మేడ పక్కనే రంగారావు బావమర్ది డాబా యిల్లు. ఆ డాబాయింటి బామ్మర్దికి మర్నాడు రాత్రి అమ్మోరు కల్లో కొచ్చిందని తెల్పి మళ్ళీ ఆ యింటి ముందు మూగేరు వీధి వాళ్ళంతా.

"ఒలే మీరంతా ఎందుకొచ్చేరు కస్టాలైనా సుకాలైనా సరి సమానంగ అనుబగించాలని కదా మనీది కట్టు. ఈ మాట్లు ఇందానికే గాని కట్టు ఆ మాట నిలబెట్టుకోడానికి లేదేంటా? నిన్న నాకైంది ఇయ్యాళిడికైంది రేపు మరోడికైంది. మరింకా మర్నాడు సూస్తా వూరుకోదురా అమ్మోరు వీధి వీధంతటీన్ని సీపురు కట్టెట్టి తుడిసీస్ది అంతే కదురోరె అమ్మోరు సెప్పినట్టూ మీరు కూడా సేస్తిరా ఓరి మనీదివంక పరమనివుడు కూడా కన్నెత్తి సూళ్ళేడు. ఆ పైన మియ్యిష్టం" అని బామ్మర్దింట్లో కులాసాగా కూర్చోని కంటసంగా మాటాడేడు రంగారావు.

ఈ దెబ్బతో అమ్మోరికి బయపడో లేకపోతే వీధిలో మోతుబరి పలుకుబడినోడు రంగారావు దగ్గర అప్పులూ, తాకట్లూ వుండడం చేతనో వీధిలో వాళ్ళంతా వప్పుకున్నారు. ఒప్పుకోవడమేమిటి అమ్మోరన్న మాట ప్రకారం వారం రోజులకల్లా కలశం ప్రతిష్ఠించడం, దాని మీద ఓ అరడుగుల ఎత్తు గోపురం లాంటిది కట్టించెయ్యడం జరిగిపోయింది. ఓ మంచి మంగళవారం చూసి పండక్కూడా చేసీసుకున్నారు.

అమ్మోరి పండుగనాడు సుష్టుగా పులిహోర, దద్ధోజనం, బూర్లూ, గారెలూతో భోజనంచేసి మధ్యాహ్నం వాలు కుర్చీలో దర్జాగా, ధీమాగా కూర్చున్నాడు రంగారావు. కమీషనరుగారికి విందు చేసిన రోజు తర్వాత రంగారావు నిబ్బరంగా, ధీమాగా కూర్చున్నదా రోజే.

మ్యునిసిపల్ కమీషనరుగారికి విందు చేసిన రోజు. ఏదో మాటల సందర్భంలో కమీషనరు అన్నారు "మీ వూరు కొద్ది

రోజుల్లో బాగా డెవలప్ అయిపోతుందండీ రంగారావుగారూ. ముఖ్యంగా మీ వీధి చూసేరూ అది బై పాస్ రోడ్ చేసే ప్రపోజల్ హైద్రాబాదులో ఒచ్చింది. మీ ఇంటి వరసంతా ఎంక్రోచ్‌మెంటే బహుశా పోవచ్చునేమో!''

గుండెలు గుబుక్కుమన్నాయి రంగారావుకి. అయినా పేదలకి పెద్దబాబు అని పేరు తెచ్చుకున్నాడు. అంత తొందరగా వదుల్తాడా తను ''అదెలాగ్గవుద్దండీ మా యీది మా యింటొరసలో మా లాంటోళ్ళం తిరగా కట్టుకుంటానికి కాయిత పెట్టుకుంటే ప్లేన్ ఎప్ర్యూవ్ సేసింది మునిసిపాల్టోళ్ళే కదండీ ... ఎంక్రోచ్‌మెంటయితే అప్పుడె లాగ్గసేసినట్టు?''

''అప్పుడేదో తిరకాసుల్తో బురడీ కొట్టించీస్తే అప్పట్లో కౌన్సిల్ కదా ఉండేదీ ఎప్రూవ్ చేసీసుండాలి ఏదేమైనా ఇది హైద్రాబాద్ నుండి వొస్తున్న ప్రపోజల్. తిరుగుండదు'' అని ఇంకేదో టాపిక్‌లోకి దిగిపోయేడు కమీషనరు.

ఆ లెక్కన రంగారావు మేడ రోడ్ పోయింట్ నుండి సుమారు పదడుగులు అంటే ముందున్న గదంతా పోతుంది. పక్కన బావమరిది ఇల్లు రోడ్ పోయింట్‌కి కొంత దూరంలో ఉండటంవల్ల ఓ అయిదడుగులు మాత్రం పోతోంది. ఇలాగే ఆ వరస ఇళ్ళన్నీ మూడో, రెండో, ఒకటో చివరికి మెట్లయినా కొట్టేయ్యాల్సి వుంటుంది.

ఇంక ఆ రోజు విందు నోటికి చేదయిపోయింది. ఆ రాత్రి నిద్ర కంటికి దూరమయిపోయింది. మెదడులో ఆలోచనలు ముళ్ళు పడిపోయింది. అద్దగ్గో అలాంటి సమయంలో వొచ్చిందమ్మోరు కల్లోకి.

ఆ రోజు తర్వాత ఈ రోజే కడుపునిండా భోంచేసేడు, కంటి నిండా నిద్ర పోయేడు.

కాని సరిగ్గా ఆ మరుసటి మంగళవారం తెల్లవారేసరికల్లా మ్యునిసిపల్ కమీషనరు బృందం వీధిలోనికి విహారానికి తయారు. ధీమాగానే వెళ్ళి పలకరించేడు రంగారావు, ''దణ్ణాలండీ కమీసనరుగారూ! ఏటిలా పొద్దున్నే దర్శనం ఇప్పించీసేరు. మయ్యింటికి దైసేయించి మదర్పితసెందన తాంబూలాలు'' అంటూ మొదలెట్టేడు చమత్కారంగా.

''లేదండీ రంగారావుగారు చెప్పేనుకదూ హైద్రాబాద్ ప్రపోజలని దానికి ప్లాను ప్రకారం మార్కు చేయించడానికి వచ్చేను. గుర్తులు పెట్టించినంత మేర మీ వీధిలో ఇళ్ళన్నీ కొట్టేస్తే సరేసరి లేదా మా వాళ్ళే ఆ పని చేసేస్తారు'' అన్నాడు కమీషనరు.

నడుం నటుక్కుమంది రంగారావుకి. అయినా నిబ్బరంగానే 'ఏటి కమిసనరుగారు తెల్లారే ఆసికాలాడ్దాని కొచ్చినట్టు గున్నారు'' అని అన్నాడు. ''లేదండీ నిజంగానే ఇంతకు ముందు మీకు చెప్పినట్టున్నాను కూడా'' అని కన్ఫర్మ్ చేసేడు కమీషనరు.

''ఆసికాలు కాపోతే ఏటండి?మా ఇళ్ళంటే కొట్టేస్తారో కొట్టేసేసుకుంటారోసేస్తాం. కాని అమ్మోరి గోపురం సరింగా రోడ్డుకి నడమజ్జినున్నాదికదా రోడ్డెల్పెలాగసేస్తారు. అమ్మోరి గోపురవంటే మనిందూ మతానికి సిన్హం మరిగలాంటి సిన్హాలన్నీ మట్టిపాల్చెయ్యడానికి మన రాజ్జేంగం వొప్పద్దా? రాజ్జేంగవొప్పినా వొప్పపోయినా అమ్మోరొప్పద్దా? తన గుడి నేల కరిపించినోడిని సర్వనాసనం సెయ్యకుండా ఒగ్గుద్దా? మరి గంచేతనేటంటే కమీసనరుగారూ మియ్యన్నీ

ఏలాకోలాలంటన్నాను" అని మళ్ళీ ఓ నవ్వు నవ్వేసేడు రంగరావు.

"ఇన్నేళ్ళనుండీ మున్సిపల్ జాగా ఆక్రమించి అనుభవించడమే తప్పు. ఆ తప్పు కప్పుకోడానికి మతాన్ని ఉపయోగించబోవడం ఎ గ్రేట్ గ్రేండ్ ఎర్రర్. ముందు ఇళ్ళ సంగతి చూడండి. వారం రోజుల్లో జరగాలి. ఇక అమ్మవారి గోపురం సంగతి. అది అమ్మవారి గోపురవనేకన్నా రంగారావుగారి అధికారంకి రక్షణగా అభివృద్ధి నిరోధక శక్తుల్లాంటి గోడ కట్టి తెలివి తేటల వెల్ల వేసిన కోట మాత్రమే ఇది. అయినా పర్మిషను లేకుండా కట్టిన గోపురం సంగతి పై అధికారులు చూసుకుంటారు." అప్పటికే చేరిన ఆ వీధి వాళ్ళనుద్దేశించి అన్నారు కమీషనరుగారు అంటూ సర్వేయర్లకి సూపర్ వైజరుకి మార్కు చేయించే పని పురమాయించేరు. ఆ వేళ సాయంత్రానికి ఆ పని పూర్తయి బృందవంతా వెళ్ళిపోయేసరికి రంగారావు మేడ దగ్గర ఆ వీధి వాళ్ళంతా చేరేరు.

"ఏటి రంగయ్మావా ఇలాగ చేసినావ్? ఇళ్ళన్నీకొట్టిస్తంటే వూరకే సుట్ట కాలుస్తా కూకున్నావేటి? అని ఒకరూ," మిమ్మల్ని కమిసనరు బావన్ని మాటలంటంటే వొల్లకున్నారేటిబావూ?" అని మరొకరు, "ఎట్రా ఆల్లుడూ దీనికేటన్నా అవుడియా ఆలోసించినావా నేదా?" అని ఇంకొకరూగా ప్రశ్నల రూపంలో చుట్టుముట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసేసేరు.

"ఓరెల్లంద్రా ... మీరు నన్నడిగే వోళ్ళూ నేను మీకు సెప్పేవోణ్ణీ అయ్యేనేంట్రా అయినా రొండు ముక్కలాలకించండి సెప్తన్నా. కమిసనరోడికింత లంచపెట్టయినా గుమ్మాలు కొట్టడవాపించాల... రొండో దేటంటే ఇయ్యేయూపనికి రాకపోతే కోర్టుకెక్కాల. ఈ రొండింటికే మీరంతా సిద్దవేనంట్రా." అని తీక్షణంగా ఆలోచించి తీవ్రంగా చూసి సూటిగా అడిగేడు రంగారావు. దానిమీద తీక్షణంగా తర్జన భర్జనలు జరిగేయి. తీవ్రంగా కొట్టుకున్నారు మాటల్తో. సూటిగా సమాధానం చెప్పేరొక్కమాటగా.

"లంచం పుచ్చుకుంటే సరేసరి లేకపోతే రెండోసారి మళ్ళీ ఎవరిచేతనైనా ఏదో డబ్బు ఇప్పించినట్టే ఇప్పించి లంచంతీసుకుంటున్నాడన్న నేరం మోపించి శంకరగిరి మన్యాలు పట్టించేద్దాం" అని ప్లానువేసేడు రంగారావు. మొదటికే మోసవొచ్చింది. "లంచం ఇవ్వడం కూడానేరం. ఇలాంటి పనులుచేస్తే రిపోర్టుచెయ్యాల్సి ఉంటుంది" అని చూపుడువేలు ఝూడించి మరీ చెప్పేడు కమీషనరు.

లీగల్‌గా ప్రొసీడవడానికి పర్మిషను కూడా అడిగేడు రంగారావు. "ఇవ్వడానికి నాకేం అభ్యంతరం లేదుగాని ఏభయ్యేళ్ళ నాటి మ్యునిసిపాలిటీప్లానూ, డాక్యుమెంట్సు నాదగ్గరున్నాయ్. అందులో మీవన్నీ ఎంక్రోచ్‌మెంట్సన్న విషయం స్పష్టంగా వుంది. ఆపైన స్పెషలాఫీసర్ని. ఇంక మీ ఇష్టం." అని ముక్తసరిగానే చెప్పినా ముక్కుమీద గుద్ది మరీ చెప్పేడు కమీషనరు.

అంతే అభివృద్ధి కార్యక్రమాలకడ్డు లేదని లోకానికి చాటిచెప్తున్నట్టుగా పెద్దశబ్దం చేసుకుంటూ ధీమాగా బుల్‌డోజర్ నడుస్తుంటే అభివృద్ధినిరోధకశక్తుల గతి యింతేనన్నట్టుగా అమ్మోరిగోపురం, రంగారావు మేడలో కొంతభాగం దానికింద నుగ్గునుగ్గయిపోయేయి.

*